

సోమశిలలో 47.682 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 47.682 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 5,730, ఉత్తర, దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.95,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,654
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,914
నవర (8 గ్రాములు)	రూ.71,312

గరిష్టం/కనిష్టం
40.0 /30.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 53 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఏపీ ఈసెట్‌లో బాలికల సత్తా

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్‌లో బాలికలు సత్తా చాటారు. గురువారం విజయవాడలో ఏపీఈసెట్ ఫలితాలను విడుదల చేశారు. చేజర్లకు చెందిన నాగపూజిత మ్యాథ్స్ విభాగంలో 62 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 996 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 761 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రవేశ పరీక్షలో 718 మంది అర్హత సాధించారు. బాలికల విభాగంలో 94.44 శాతం, బాలురు 92.86 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు 478 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు గురువారం జిల్లా వ్యాప్తంగా 478 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షకు 12,240 మందికి గానూ 11,809 మంది హాజరయ్యారు. 431 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 1055 మందికి గానూ 1008 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరయ్యారు.


ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్‌శాఖ ఏపీటీఎస్ (యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్) సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆంజనేయరెడ్డి గురువారం విద్యుత్ భవన్‌లోని ఆయన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంజనేయరెడ్డి ఇప్పటివరకు ఏసీబీ నెల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

పలువురు రైతులకు ఏసీబీ నోటీసులు

పొదలకూరు: మండలంలోని కొందరు రైతులకు ఏసీబీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. 2018లో పొదలకూరు తహసీల్దార్‌గా పనిచేసిన స్వాతి రైతులకు అందజేసిన పట్టాదార్ పాసుపుస్తకాలకు సంబంధించి విచారణలో భాగంగా ఏసీబీ సీఐ రైతులకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. మండలంలోని మొగళ్లూరు, అల్లూర్తి, ఆర్‌వైపాళెం తదితర గ్రామాలకు చెందిన రైతులకు ఏసీబీ కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది వీఆర్వోల ద్వారా నోటీసులు అందజేసినట్టు రైతులు వెల్లడించారు. రైతులు వీలుచూసుకుని ఏసీబీ కార్యాలయానికి హాజరై వారు పొందిన పట్టాలు, పాసుపుస్తకాలకు సంబంధించిన వివరాలను వెల్లడించాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది.

సోమశిల క్రస్ట్‌గేట్ల నుంచి లీకవుతున్న నీరు



సోమశిల: సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు లీకయి వృథాగా పోతోంది. ముఖ్యంగా 3, 6, 11 క్రస్ట్‌గేట్లు, ఉత్తర, దక్షిణ కాలువ గేట్ల నుంచి కూడా ఇలా జరుగుతోంది. లీకేజీలను అరికట్టేందుకు ఏటా రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. కాగితాల్లో ఈలెక్కలు కనిపిస్తున్నా వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే పనులు అన్నీ డొల్లేనన్న విషయం అర్థమవుతోంది. ఐఏబీ నిర్ణయం మేరకు రెండవకారుకు నీరు విడుదల చేస్తున్న ఈ సమయంలో జలాశయం అధికారులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. రెండు నెలల క్రితం రాష్ట్ర జలవనరుల సాంకేతిక సలహాదారుడు కన్నయ్యానాయుడు స్వయంగా జలాశయాన్ని పరిశీలించి క్రస్ట్‌గేట్లు, రోప్‌లు తుప్పు పట్టి దెబ్బతిన్న వాటిని గుర్తించారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని హెచ్చరించారు. అయినా ఆ పనులపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

కార్మికుల పొట్టకొడుతున్నారు!



నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం ఏడాదికి సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేస్తున్నా.. వాటి వినియోగంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కార్మికులకు జీతాలు తగ్గించి ఇవ్వడం, లెక్కల్లో సంఖ్య ఎక్కువ చూపి తక్కువ మందితో పనిచేయించడం, కొత్తవారి నియామకంలోనూ లంచాలు తీసుకోవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి.

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో ఇదీ పరిస్థితి
- శానిటరీ వర్కర్స్ జీతాల్లో కోత
- కొత్తవారిని తీసుకోవాలంటే లంచాలు
- పక్కదారి పడుతున్న వేతనాల సొమ్ము
- పని మానేసిన వారి పేరుతోనూ జీతాలు
- అధికారులు, రాజకీయ నేతలకు వాటాలు



పెద్దాస్పత్రిలో గుమిగూడిన పారిశుద్ధ్య కార్మికులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం ఒక ఏజెన్సీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విజయవాడలో ఉండే ఆ ఏజెన్సీ యాజమాన్యం నెల్లూరులో ఒక మేనేజర్‌ను నియమించి ఆయన ద్వారా ఆస్పత్రిలో, మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తోంది. అయితే పెద్దాస్పత్రిలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. యాజమాన్యం కార్మికుల జీతాల్లో కోతలు పెడుతోంది. కొందరు కార్మికులు విధులకు హాజరు కాకపోయినా హాజరు వేసి జీతాలు డ్రా చేస్తున్నారు. ఇదే కాకుండా మూడు నెలల పాటు జీతాలు లేకుండా పని చేసేటట్టు ఒప్పందం కుదుర్చుకుని కొత్తగా కొంతమంది కార్మికులను మేనేజర్ చేర్చుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి. కార్మికుల జీతాల్లో కోత పెట్టిన సొమ్మును రూరల్ నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ఒక ప్రధానమైన వ్యక్తికి, పెద్దాస్పత్రిలోని అధికారులకు వాటా రూపంలో ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీతాల్లో కోత, ప్రశ్నించేవారిని ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మేనేజర్‌కు వ్యతిరేకంగా కార్మికులు పోరాటానికి సిద్ధమయ్యారు. అయితే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ జోక్యంతో ఘర్షణ వాతావరణం లేకుండా సర్దుబాటు జరిగింది.

సిబ్బంది సంఖ్యలో తేడా..?

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో అగ్రిమెంట్ ప్రకారం 145 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేయాలి. అయితే సెలవులు, మెడికల్ లీవులు ఇవ్వాల్సి ఉన్నందున మరో 28 మందిని అదనంగా తీసుకుని మొత్తం 173 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయిస్తున్నారు. అలాగే మెడికల్ కళాశాలలో మరో 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. రెండు చోట్ల కలుపుకుని మొత్తం 223 మంది కార్మికులు, సూపర్‌వైజర్లు పని చేస్తున్నారు. అలాగే పెద్దాస్పత్రిలో 110 మంది సెక్యూరిటీ సిబ్బంది, మెడికల్ కళాశాలలో 27 మంది సెక్యూరిటీ కలిపి మొత్తం 137 మంది పనిచేస్తున్నారు. ఇవన్నీ కాగితాల్లో లెక్కలు మాత్రమే. వాస్తవాన్ని పరిశీలిస్తే అంతమంది పని చేయడం లేదు. పెద్దాస్పత్రిలో 145 మందికి గానూ 120 మంది మాత్రమే పని చేస్తున్నారు. మెడికల్ కళాశాలలో కూడా అంతే. పెద్దాస్పత్రిలో పని చేసే కార్మికులనే మెడికల్ కళాశాలలో పని చేయిస్తుంటారు. ఇలా పలువురి జీతాలను మిగుల్చుకుంటారు. ఈ లెక్కలు బయట పడాలంటే బయోమెట్రిక్ హాజరు, ఎఫ్ఆర్ఎస్ హాజరు పోల్చి చూడాల్సిన అవసరం ఉంది.

కొత్తగా చేర్చుకుంటే లంచాలు

కొంతమంది చదువులేని కార్మికులకు పుట్టిన తేదీ లేదు. ఆధార్ ఉండటం లేదు. పీఎఫ్ ఖాతాలో నగదు జమ చేసేందుకు ఏదో ఒక గుర్తింపు ఉండాలి. అయితే 14 మంది కార్మికులకు పాస్‌పోర్టు తయారు చేయించి ఇస్తామని దానిలోని పుట్టిన తేదీ ఆధారంగా పీఎఫ్ నగదు జమ చేస్తామని మేనేజర్, ఒకరిద్దరు సూపర్ వైజర్లు నమ్మబలికారు. నెల్లూరులోనే పాస్‌పోర్టు కార్యాలయం ఉంది. ఫీజు కేవలం రూ.1500 మాత్రమే. ఏజెంట్ ఫీజు మరో రూ.1000 కలుపుకుని మొత్తం రూ 2,500 మాత్రమే. 14 మంది కార్మికులకు పాస్‌పోర్టు చేయిస్తామని రూ.15 వేల వంతున వసూలు చేశారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా ఒక కార్మికురాలు ధైర్యం చేసి హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులుకు తెలిపింది. ఎవరు వసూలు చేశారని ఆయన అడగగా ఒక సూపర్‌వైజర్‌ను నేరుగా వేలుపెట్టి చూపింది. అయితే తమను ఉద్యోగంలో నుంచి తీసేస్తారనే భయంతో పలువురు ఫిర్యాదు చేయడం లేదు.

నెలకు రూ.80 లక్షలు విడుదల

పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాలలో పని చేసే పారిశుద్ధ్య, సెక్యూరిటీ గార్డులకు నెలకు ప్రభుత్వం రూ.80 లక్షలు విడుదల చేస్తోంది. అగ్రిమెంట్ ప్రకారం పారిశుద్ధ్యం బాగుండాలి. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండకూడదు. మ్యాన్ హోల్స్ శుభ్రపరచాలి. పరిసరాల్లో గడ్డి లేకుండా చేయాలి. ఇలా పది రకాలుగా నిబంధనలు పాటించాలి. ఒక్కో నిబంధన సక్రమంగా పూర్తి చేస్తే అందుకు కొన్ని మార్కులుంటాయి. ఈ నిబంధనలు ఏమీ పాటించక పోయినా పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా సిద్ధానాయక్ శానిటేషన్‌కు 96 శాతం మార్కులు తగ్గకుండా వేస్తున్నారు. అంటే రూ.80 లక్షల్లో రూపాయి కూడా తగ్గకుండా ఏజెన్సీకి అందుతాయి. ఈ నిధుల్లో రాజకీయ నాయకుల దగ్గర నుంచి అధికారుల వరకు కమీషన్లు చేతులు మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

జీతాలు, పీఎఫ్‌లో కోతలు

ప్రభుత్వ అగ్రిమెంట్ ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు జీతంగా రూ.16 వేలు ఇవ్వాల్సి ఉండగా పీఎఫ్, ఇఎస్ఐ లాంటి కటింగ్స్ పోగా రూ.13,500 కార్మికుని ఖాతాలో జమ చేయాలి. అలాగే సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించి ఇవ్వాల్సిన రూ.14,800 జీతంలో పీఎఫ్, ఈఎస్ఐ తదితరాలు పోగా రూ.10,500 జమ చేయాలి. అయితే వీరికి ఇవ్వాల్సిన జీతం పూర్తి స్థాయిలో అందడం లేదు. రెగ్యులర్‌గా డ్యూటీలకు వచ్చినప్పటికీ చదువురాని అనేక మందికి హాజరు తగ్గించి వేసి జీతాలు ఇస్తున్నారు. కొంతమందికి రూ.6 వేలు నుంచి రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిదీ అదే పరిస్థితి. ఇక కార్మికుని ఖాతాలో జమ చేయాల్సిన పీఎఫ్‌లో ప్రతి నెలా కొంత మందికి కోత విధిస్తున్నారు. జీతం ఎందుకు తగ్గించారని ప్రశ్నిస్తే ఇక వేధింపులే. కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నారు.



ఆస్పత్రిలో రూ.30 వేల జీతంతో పని చేస్తున్నట్టు ఇచ్చిన ఫేక్ శాలరీ సర్టిఫికెట్

30 మందిని తొలగిస్తున్నట్లు బెదిరించి..



ఐదు రోజుల క్రితం సంబంధిత ఏజెన్సీకి చెందిన మేనేజర్ ఆస్పత్రిలోని 10 మంది సూపర్ వైజర్లను, 20 మంది శానిటరీ సిబ్బందిని తొలగిస్తున్నట్టు ఆస్పత్రికి చెందిన గ్రూపులో మెసేజ్ పోస్టు చేశారు. వారికి హాజరు వేయవద్దని రాంబాబు అనే సూపర్‌వైజర్‌కు సూచించారు. అలాగైనా బెదిరించి వీరి నుంచి డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో ఇలా చేశారని ప్రచారం జరుగుతోంది. దీంతో శానిటరీ సిబ్బంది తిరగబడ్డారు. ఈ విషయమై ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సంబంధిత కాంట్రాక్టర్ ప్రస్తుతానికి ఆ మేనేజర్‌ను పక్కన బెట్టారు. గతంలోనూ ఇలాగే జరిగినా వారం తర్వాత అదే మేనేజర్‌ను కొనసాగించారు. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని కార్మికులంటున్నారు.

లంచాలు తీసుకుని కొత్తవారి నియామకం

కొత్తగా సెక్యూరిటీ గార్డులను, శానిటరీ వర్కర్స్‌ను చేర్చుకుంటే వారి నుంచి రూ.35 వేలు నుంచి రూ.50 వేలు వరకు వసూలు చేస్తున్నారు. సూపర్‌వైజర్‌కు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. లేదంటే కొంతకాలం పాటు జీతాలు లేకుండా పని చేయాలని ఒప్పందాలు చేసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. గూడూరు పట్టణానికి చెందిన ఓ కార్మికురాలు మెడికల్ కళాశాలలో లంచాలు ముట్టచెప్పించి ముగ్గురు వ్యక్తులను చేర్పించినట్టు విశ్వసనీయ సమాచారం.

లంచాలతో ఫేక్ సర్టిఫికెట్‌లు

పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తే గట్టిగా వచ్చేది రూ.10వేలు మాత్రమే. అయితే ఆస్పత్రిలో పనిచేసే ఒక కార్మికురాలు ఒకటిన్నర సంవత్సరం క్రితమే మానేసింది. ఆమె మూడు నెలల క్రితం పెద్దాస్పత్రిలో పని చేస్తున్నట్టు కటింగ్స్ పోను ఇంకా రూ.30వేలు జీతం వస్తున్నట్టు ఒక శాలరీ సర్టిఫికెట్‌ను ఏజెన్సీ సంస్థ పేరుతో ఇచ్చారు. దానిని బ్యాంకులో చూపెట్టి రూ.3లక్షలు రుణం కూడా ఆమె పొందింది. ఇందుకోసం ఆ మహిళ లంచం ముట్టచెప్పింది. మేనేజర్‌కు అనుకూలంగా ఉన్న ఓ సూపర్ వైజర్ లంచాలు తీసుకుని ఇలాంటి ఫేక్ సర్టిఫికెట్‌లను పలువురికి ఇచ్చింది.

లోపాలు సరి చేస్తున్నాం

శానిటరీ, సెక్యూరిటీ విభాగాల్లో కొన్ని లోపాలున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని ఏజెన్సీ కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన నాలుగు రోజుల్లో అన్నీ సరి చేస్తామన్నారు. తాము పరిశీలించి కార్మికులకు న్యాయం చేస్తాం. లోపాలు సరిచేస్తాం. – నరేంద్ర, సూపరింటెండెంట్, ఎఫ్ఏసీ, పెద్దాస్పత్రి

ట్రూఅప్ చార్జీలు రద్దుచేయండి



విద్యుత్ భవన్ వద్ద సీపీఎం నాయకుల నిరసన

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలి
- విద్యుత్ భవన్ వద్ద సీపీఎం ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన అదనపు భారాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించాలంటూ సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు 30 శాతం తగ్గిస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చాక ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారని విమర్శించారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని చెప్పినా.. నేడు కొనసాగిస్తోందని అన్నారు. స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లకు అయిన రూ.96 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంచల నరసయ్య, అబ్దుల్ అజీజ్, సతీష్, రఫీఅహ్మద్, సంపత్, సుధాకర్, శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు లబ్ధిదారులు ఒకే ప్లాట్..

- ఇవీ రెవెన్యూ అధికారుల లీలలు
- లేఅవుట్‌లో అక్రమంగా గృహ నిర్మాణం
- పోలీసు అధికారుల సహకారం
- విస్తుపోతున్న గ్రామస్తులు



ప్లాట్‌లో నిర్మాణ పనులు ప్రారంభించినప్పుడు..

సాక్షి టాస్క్‌ఫోర్స్: రెవెన్యూ శాఖ అధికారుల అక్రమాలకు అంతేలేకుండా పోతోంది. ఒకే నంబరు గల ప్లాట్‌ను ఐదుగురికి పట్టాలుగా ఇచ్చిన వైనం తాజాగా వెలుగు చూసింది. లంచాలు వసూలు చేసి ఈ మేరకు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లు లేని పేద ప్రజల కోసం జగనన్న గృహ కాలనీ నిర్మాణం చేపట్టారు. అనంతసాగరంలోనూ లేఅవుట్ వేశారు. మండల కార్యాలయాల వెనుక ఉన్న కాలనీలో లబ్ధిదారులకు ప్లాట్‌లు ఇవ్వగా కొన్ని మిగిలిపోయాయి. వాటికి మంచి విలువ ఉండడంతో పలువురు ఆక్రమించి గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒకే లబ్ధిదారుకు రెండుసార్లు

గ్రామానికి చెందిన ఓ గులాబ్ అనే మహిళకు ఇందిరమ్మ గృహ నిర్మాణాల కింద 2009–10లో గృహం మంజూరైంది. ఆ మేరకు నిర్మాణం చేపట్టగా అప్పటి ప్రభుత్వం రూ.34వేల వరకు బిల్లులు కూడా మంజూరు చేసింది. ఇప్పుడు అదే మహిళ జగనన్న లేఅవుట్‌లోని ఖాళీ ప్లాట్‌లో నిర్మాణం చేపట్టడం చూసి గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే...


కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంపీడీఓ, వెలుగు కార్యాలయాల వెనుక భాగంలో లేఅవుట్‌లో మిగిలి ఉన్న ప్లాట్‌లను కాజేసేందుకు కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. ప్లాట్ నెంబరు 911కి నివేశ స్థల ఆధీన ధ్రువీకరణ పత్రం అధికారికంగా సృష్టించారు. ఆ ప్లాట్‌లో ఇటీవల లబ్ధిదారు గృహ నిర్మాణం చేపట్టారు.

గ్రామస్తుల ఏమంటున్నారంటే..!

పేద ప్రజలు నివాసముండేందుకు ప్రభుత్వం అందించే లేఅవుట్‌లో ఒకే నంబరు ప్లాట్‌ను పలువురు వ్యక్తుల పేరుతో పట్టా ఇచ్చిన రెవెన్యూ అధికారులు ఎవరు? అందుకు వారు లంచంగా ఎంత తీసుకున్నారు? వంటి విషయాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు సుభాషిణిని వివరణ కోరగా ఈ ప్లాట్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఏం జరిగిందంటే..

ఈ 911 నంబరు ప్లాట్‌ను 2024 మే నెలలో లింగంగుంట గ్రామానికి చెందిన కండ్లగుంట సుధా అనే మహిళకు రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. మళ్లీ అదే ప్లాట్‌ను అదే ఏడాది జూన్ నెలలో అనంతసాగరం చెందిన షేక్ గులాబ్ అనే మహిళకు ఇంటి పట్టాగా ఇచ్చారు. ప్రస్తుతం గులాబ్ కుటుంబానికి సన్నిహితుడిగా స్థానిక పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై మస్తాన్ ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. అక్రమ నిర్మాణం చేపట్టింది పోలీసు అధికారి కావడంతో ప్రశ్నించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇందులో లోతుగా పరిశీలిస్తే మరి కొన్ని విషయాలు బయటపడ్డాయి. సుధా అనే మహిళతో పాటు అదే ప్లాట్‌ను గౌరవరం గ్రామానికి చెందిన మరో ముగ్గురికి కూడా పట్టాలుగా ఇచ్చినట్లు తెలిసింది. వారు కూడా ఆ ప్లాట్లలో నిర్మాణం జరుగుతుందని తెలిసి స్థలం వద్దకు వచ్చి చూడగా అక్కడ పోలీసు అధికారి నిర్మాణం చేస్తున్నారని తెలిసి నోరు మెదపకుండా వెనుతిరిగి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.



ప్రస్తుతం స్లాబు వరకు జరిగిన నిర్మాణం

కూటమి సర్కారులో మహిళా ఉద్యోగులకు అన్యాయం



నిరసన కార్యక్రమంలో సీహెచ్ఓలు

- 18 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోరా
- నిరసన కార్యక్రమంలో సీహెచ్ఓలు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగమంటే ఒక భద్రత ఉంటుందని... అయితే ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ కూటమి ప్రభుత్వం తమను ఇబ్బందికి గురిచేయడం దారుణమని సీహెచ్ఓల అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్ అన్నారు. సీహెచ్ఓలు చేస్తున్న సమ్మె 18వ రోజుకు చేరింది. సమ్మె సందర్భంగా ప్రతి రోజూ డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద సీహెచ్ఓలు నిరసన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఏ అధికారి కూడా తమ సమస్యలపై విచారించకపోవడం, చర్చించకపోవడం బాధాకరమన్నారు. ఆడపిల్లలకు అన్యాయం చేయమని చెప్పిన కూటమి ప్రభుత్వంలో సీహెచ్ఓలుగా పనిచేసేది 90 శాతానికి పైగా ఆడపిల్లలే అనే సంగతి మరిచిపోయారని విమర్శించారు. తమకు వేతనాల్లో అన్యాయాన్ని సరిదిద్దాలని, పీఎఫ్‌ను పునరుద్ధరించాలని, వర్క్ చార్ట్ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, నాయకులు గాయత్రి, రుబికా పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవం

నెల్లూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలు జరుగుతాయని కలెక్టర్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవాలు వచ్చే ఏడాది మార్చి 16వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. నెల్లూరులో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

• జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: అందరికీ ఇళ్ల పథకంలో పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని జేసీ, నోడల్ అధికారి కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, నగర, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేకపోతే సేకరించి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జీవిత కాలంలో ఒక కుటుంబానికి ఒకసారి మాత్రమే ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకసారి స్థలం పొందిన వారు మళ్లీ పొందకుండా ఆధార్, రేషన్‌కార్డులను లింక్ చేస్తారన్నారు. స్థలం మంజూరైన రెండు సంవత్సరాల్లో ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 1,221, పట్టణ ప్రాంతాల్లో 417 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

కండలేరులో 43.941 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 43.941 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1,010, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 125
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 250
లేయర్ చికెన్ : 187



నిమ్మ ధరలు (కిలో)


పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30



- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకం
- వేలల్లో కేసులు
- వైద్యశాఖ లెక్కల్లో నామమాత్రం

డెంగీ.. చాలా డేంజర్

నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



నెల్లూరు(అర్బన్): డెంగీ.. ఇది చాలా ప్రమాదకరం. ఆడ ఏడిస్ ఈజిప్టై అనే జాతికి చెందిన దోమ కుడితే వచ్చే ప్రమాదకరమైన జ్వరాల్లో ఒకటి. దోమ కుట్టినప్పుడు దాని లాలాజలంలో ఉండే వైరస్ మనిషి శరీరంలోనికి ప్రవేశించి ఈ వ్యాధిని కలిగిస్తుంది. దీనిని ఎముకలు విరిచే జ్వరం అని కూడా అంటారు. డెంగీ బారిన పడిన అనేకమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులు ఎంతోమంది ఉన్నారు. అందువల్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆ జ్వరం రాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరిస్తూ కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం మే 16వ తేదీని జాతీయ డెంగీ నివారణ దినోత్సవంగా ప్రకటించింది. జిల్లాలోనూ మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎన్నో కేసులు

సీజనల్ వ్యాధిగా పిలిచే డెంగీ జ్వరం జిల్లాలో ప్రతి సంవత్సరం వేలాది మందికి సోకుతోంది. ఎన్‌ఎస్1 ర్యాపిడ్ పరీక్ష ద్వారా ఈ జబ్బును నిర్ధారిస్తున్నారు. నెల్లూరులోని వివిధ హాస్పిటళ్లలో ప్రతి సంవత్సరం వేలాది కేసులు నమోదవుతున్నాయి. రెండు, మూడు వందల కేసులకు చికిత్స చేసిన ఆస్పత్రులున్నాయి. అయితే వైద్యశాఖ మాత్రం కాకి లెక్కలు చెబుతోంది. దాని గణాంకాల ప్రకారం 2022లో 148, 2023లో 193, 2024లో 130, 2025లో (ఏప్రిల్ వరకు) 16 కేసులు మాత్రమే నమోదయ్యాయి. రాపూరు, సీతారామపురం, ఉదయగిరి, కలువాయి, దుత్తలూరు, బోగోలు, కలిగిరి, ఆత్మకూరు, నెల్లూరు, కావలి రూరల్ తదితర ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా వచ్చినట్టు పేర్కొంటున్నారు. అన్ని పీహెచ్‌సీలతోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీని నిర్ధారించే ర్యాపిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అయితే వైద్యశాఖాధికారులు మాత్రం ఆ పద్ధతిలో కాకుండా ఎలీసా పద్ధతిలో చేసే పరీక్షలను డెంగీగా నిర్ధారిస్తున్నారు. మిగతా వాటిని లెక్కల్లోకి తీసుకోవడం లేదు.

లక్షణాలు ఏంటంటే?

డెంగీ వ్యాధి సోకిన వారిలో కీళ్ల, కండరాల నొప్పులు, వికారం, వాంతులు, దద్దుర్లు, తలనొప్పి లక్షణాలుంటాయి. శరీరం విపరీతంగా నొప్పులకు గురవుతుంది. ఎక్కువ మందికి దానంతట అదే తగ్గిపోతుంది. అయితే పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. రక్తకణాలు తగ్గిపోతున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో వాటిని ఎక్కించాల్సి ఉంటుంది. కడుపునొప్పి రావొచ్చు. మరికొన్ని లక్షణాలున్నాయి. పలువురికి వైద్య చికిత్సకే రూ.లక్షలు ఖర్చవుతాయి. ఆర్థికంగా చితికిపోతారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకమవుతుంది.

నివారణ ముఖ్యం



డెంగీ వ్యాధిని నివారించాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం. కొంచెం నీరు కూడా నిల్వ చేరకుండా చూడాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలి. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకుని దోమలు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం ఎలాంటిదైనా సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ల సూచన మేరకు మందులు వాడాలి.

ప్రత్యేక చర్యలు



జిల్లాలో డెంగీ కేసులు అదుపులో ఉన్నాయి. అక్కడక్కడా నమోదవుతున్నాయి. నివారణకు జిల్లా వైద్యశాఖ తరఫున ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఎక్కడైనా డెంగీ, మలేరియా లాంటి కేసులు నమోదైతే ఫీవర్ సర్వే, దోమ లార్వా సర్వే చేస్తున్నాం. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. పరసరాల్లో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయిస్తున్నాం. వారానికి ఒకరోజు నీటి పాత్రలను ఎండబెట్టాలంటూ ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. నీటి నిల్వ ఉన్న గుంతల్లో దోమల గుడ్లు తినే గంబూసియా చేపలు వదులుతున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. వేసవిలో ప్రతి హాస్టళ్లలో దోమల నివారణకు మందును పిచికారీ చేయిస్తున్నాం.

– హుస్సేనమ్మ, జిల్లా మలేరియా నివారణ అధికారి

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో బ్యానర్లు, వాల్‌పోస్టర్లను ఆనంద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది డయేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు రాకుండా ఉండేందుకు ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. డెంగీపై ప్రజలను అప్రమత్తం చేస్తూ తగిన సూచనలివ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుజాత, జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పీఓ డాక్టర్ రమేష్, డాక్టర్ బ్రహ్మనాయుడు, సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌ఓ సుజాత తదితరులు

అయ్యో.. నా బిడ్డను కాపాడండి

- సౌదీ అరేబియా నుంచి రప్పించండి
- తహసీల్దార్‌కు ఓ తండ్రి విన్నపం



నజీర్

కలువాయి(సైదాపురం): 'పొట్టకూటి కోసం నా బిడ్డ సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ యజమాని చిత్రహింసలకు గురిచేస్తూ నా బిడ్డను చంపే ప్రయత్నం చేస్తున్నాడయ్యా. కనికరించి మావాడిని మన దేశానికి రప్పించండి' అంటూ షేక్ కాలేషా అనే వ్యక్తి కోరాడు. అతడి కథనం మేరకు.. కలువాయి మండలంలోని కుల్లూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా, బీబీ దంపతులకు షేక్ నజీర్ అనే కుమారుడున్నాడు. అతను 7వ తరగతి వరకు చదివి ఇక్కడే కూలీ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. 2024 డిసెంబర్ నెలలో ఓ ఏజెంట్ మాటలు విని రూ.2 లక్షలు పెట్టి నజీర్‌ను సౌదీకి పంపారు. అక్కడ యజమాని పెట్టే చిత్రహింసలు భరించలేక నజీర్ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. ఓరోజు యజమాని చెట్టు కొమ్మలను నరికే పనిని అప్పగించాడు. నజీర్ చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. కాగా మూడునెలలపాటు పని చేయించుకుని జీతం అడిగితే యజమాని చిత్రహింసలకు గురిచేయడంతోపాటు దాడి చేశాడు. తన బిడ్డను ఎలాగైనా ఇండియాకు రప్పించి ఆదుకోవాలంటూ గురువారం కాలేషా కలువాయి తహసీల్దార్ శ్యాంసుందర్‌కు విన్నవించాడు. తనను కలిస్తే ఏం జరుగుతుంది. ఎమ్మెల్యే లేదా, కలెక్టర్‌ను న్యాయం జరుగుతుందంటూ తహసీల్దార్ బాధితుడికి తెలియజేయడంతో వెనుదిరిగాడు. ఉన్నతాధికారులను కలుస్తానంటూ కాలేషా మీడియా ముందు కన్నీరుమున్నీరుగా విలపించాడు.

భక్తుల కొంగు బంగారం.. కామాక్షితాయి

రేపట్నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



జొన్నవాడలోని ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్నాయి. 17న శనివారం అంకురార్పణతో మొదలవుతాయి. 18న జరిగే ధ్వజారోహణ పూజల్లో సంతానప్రాప్తి కోసం మహిళలకు ప్రసాదం (కొడిముద్ద) అందజేస్తారు. సాయంత్రం వివిధ పూజలు, శేష వాహనసేవ, 20న పురుషామృగ వాహనసేవ, 21న సింహ వాహనసేవ, 22న హంస వాహనసేవ, 23న రావణసేవ, 24న వెండి నందిసేవ, 25న రథోత్సవం, సాయంత్రం పెనుబల్లి గ్రామంలో గజసింహవాహన సేవలు జరుగుతాయి. 26న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం తెప్పోత్సవం, 27న ఉదయం ధ్వజావరోహణ, అలకల తోపు, రాత్రి 8 గంటలకు అశ్వవాహనసేవ, రాత్రి 10 గంటలకు ఏకాంతసేవ, పుష్పాలంకరణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు జరిగే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం పరీక్షలపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హాల్‌టికెట్ చూపించిన వారికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల జరుగుతాయన్నారు. 38 సెంటర్లలో 5,422 మంది హాజరుకానున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టెన్త్‌లో 745 మంది అభ్యర్థుల కోసం 12 సెంటర్లు, ఇంటర్‌లో 949 మంది కోసం 6 సెంటర్లు ఎంపిక చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, తనిఖీ బృందాలను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా..

- పెనుశిల అభయారణ్య ఎకో సెన్సిటివ్ జోన్‌కు ప్రణాళిక
- కలెక్టర్ ఆనంద్



చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా తదితరులు

నెల్లూరు(అర్బన్): స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బంది లేకుండా పెనుశిల నరసింహ అభయారణ్యం ఎకో సెన్సిటివ్ జోన్ మాస్టర్ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ అటవీ శాఖ అధికారులు, సంబంధిత స్టేక్ హోల్డర్లకు సూచించారు. గురువారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఎకో సెన్సిటివ్ జోన్, జిల్లాలోని చిత్తడినేలను నోటిఫై చేసే అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా వాటికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. కేరళలోని తిరువంతపురం నుంచి వచ్చిన సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ జోన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ అభయారణ్యంలో మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన నిబంధనలు, నిషేధించాల్సిన అంశాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్లాన్‌లోని అంశాలను ఎకో సెన్సిటివ్ జోన్‌లో నివసించే ప్రజలకు వివరించి వారి నుంచి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి పరిధిలో ఎన్నుకోబడిన చిత్తడి నేలలను నోటిఫై చేసి వాటిని పరిరక్షించేందుకు ఎలాంటి అభ్యంతరాలున్నా శుక్రవారం సాయంత్రంలోపు తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులు లేకపోతే 5 నోటిఫికేషన్లను రాష్ట్ర స్థాయి వెట్‌ల్యాండ్ అథారిటీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ శరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవతి, ఆర్‌అండ్‌బీ డీఈఈ రంగయ్య, మత్స్యశాఖ జేడీ శాంతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, నెల్లూరు, రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి రేంజ్ ఆఫీసర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, కుమార్‌రాజా, శేఖర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి..

• ఒకరి మృతి

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం కొత్తసత్రం గ్రామానికి చెందిన డోకి రవికుమార్ (36) అనే వ్యక్తి ఆటోలో నుంచి జారిపడి మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. కొత్తసత్రానికి చెందిన రవికుమార్ ఆకుకూరలు పండించి కావలిలో అమ్ముకుంటూ జీవనం సాగిస్తాడు. గురువారం అతను గ్రామానికి చెందిన అరగల పొట్టయ్య ఆటోలో కావలికి వస్తుండగా మార్గమధ్యలో జారి రోడ్డుపై పడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. రవికుమార్‌కు భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో రైతు దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పల్లాప్రోలు పంచాయతీ గోపాలపురం గ్రామంలోని వ్యవసాయ భూముల్లో ఓ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి నగర్‌లో నివాసముంటున్న సోము మల్లికార్జునరెడ్డి (48) బుధవారం సాయంత్రం ఇంటి నుంచి గోపాలపురంలోని పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి పది గంటలవుతున్నా ఇంటికి రాకపోవడంతో అతడి భార్య పొలం దగ్గరికి వెళ్లింది. అక్కడ మల్లికార్జునరెడ్డి విగతజీవిగా పడి ఉన్నాడు. తలకు బలమైన గాయం తగిలి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. గురువారం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌చార్జి సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. మల్లికార్జునరెడ్డి అతని సోదరుడు రామచంద్రారెడ్డికి మధ్య కొన్ని సంవత్సరాలుగా పొలం విషయంలో వివాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు రామచంద్రారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించామన్నారు. హత్యకు సంబంధించి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ చేస్తామన్నారు. పోస్టుమార్టం నివేదిక, సమగ్ర దర్యాప్తు అనంతరం మీడియాకు వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

గిరిజన కాలనీలో అగ్నిప్రమాదం

• పూర్తిగా కాలిపోయిన నాలుగు పూరిళ్లు



అగ్నికి ఆహుతవుతున్న గుడిసెలు

చేజర్ల(ఆత్మకూరు): మండలంలోని ఆదూరుపల్లి గిరిజన కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. నాలుగు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఇళ్లలో ఉన్న గృహోపకరణాలు, ఇతర సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు స్పందించి మంటలు అదుపు చేసినా అప్పటికే భారీ నష్టం సంభవించిందని గిరిజన కుటుంబాల వారు కన్నీటి పర్యంతమయ్యారు. సర్వం కోల్పోయామని వాపోయారు. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న చేజర్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా ఈ ప్రమాదానికి సమీపంలోనే విద్యుత్ తీగలు తెగి నేలపై పడ్డాయి. అయితే మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.